ప్రజాశక్తి
గురువారం 20 జూన్ 2024 5 విజయనగరం



21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న ఉదయం 7గంటలకు నగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఆయుష్ మంత్రిత్వశాఖ, విద్యాశాఖ, యువజన సర్వీసుల శాఖల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్, ఆయుష్ మంత్రిత్వశాఖ అధికారులు డాక్టర్ జె.ధనుంజయరావు, డాక్టర్ బి.వరప్రసాద్ తెలిపారు. తెలిపారు. ఈ సందర్భంగా సూర్య నమస్కారాలు వేయిస్తూ యోగపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పలు ప్రైవేటు వ్యాపార, వాణిజ్య సంస్థల సహకారంతో 310 యోగాసనాలతో కూడిన బ్యానర్లను రూపొందించి ఆయా పాఠశాలల్లో యోగా దినోత్సవం నిర్వహిస్తామన్నారు. నగర ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని యోగాపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు.

ఫీజులుం

- ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీ
- తల్లిదండ్రులపై మోయలేని భారాలు
- ఏటా పది శాతం పెంపు

జీవో నెంబరు 53 ప్రకారం 1 నుంచి 10 తరగతి వరకూ చదువుతున్న పిల్లలకు గ్రామీణ ప్రాంతాలలో రూ.10 వేలు, పట్టణాల్లో 15 వేలు, నగరాల్లో 20 వేలు ఫీజులు వసూలు చేయాలని గత వైసిపి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ప్రయివేటు యాజమాన్యాలు కోర్టుని ఆశ్రయించి సంబంధిత జిఒను రద్దు చేయించాయి. దీంతో తమ ఇష్టారాజ్యంగా ఫీజులతో బాటు బస్సు ఛార్జీలు, పుస్తకాలు ఇలా రకరకాలుగా ఏడాదికి రూ. వేలల్లో, కొన్ని స్కూళ్లలో లక్షల్లో వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్నాయి. అయినా విద్యా శాఖ అధికారులు మాత్రం తమకు ఏమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు సైతం దీని గురించి పట్టించుకోవడం లేదు.



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో పాఠశాలన్నీ ఈనెల 13 నుంచి పున:ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలుకు పాల్పడుతున్నాయి. అడ్డూ అదుపూ లేకుండా అధిక మొత్తంలో కలెక్షన్లు చేస్తున్నాయి. ఏటా ఇదే తంతు కొనసాగుతున్నా పట్టించుకోని అధికారుల తీరుపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో సుమారు 500కు పైగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. వీటిల్లో దాదాపు 2 లక్షల మంది ఏటా చదువుతున్నారు. పలు విద్యాసంస్థల్లో నియంత్రణ లేని ఫీజులను వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లే స్కూల్, నర్సరీ, ఎల్‌కెజిలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు, 1 నుంచి 5 వరకూ రూ.15 వేల నుంచి రూ.35 వేలు, 6 నుంచి 10 వరకూ రూ.30 వేలు నుంచి లక్ష వరకూ కూడా వసూలు చేసే కార్పొరేట్ పాఠశాలలున్నాయి. అలాగే బస్సు, యూనిఫామ్, పుస్తకాలు ఇలా రకరకాల పేర్లతో ఫీజుల వసూలు జరుగుతోంది. ఫీజుల విషయంలో నిబంధనలు పాటించడం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. పైగా ఫీజు చెల్లిస్తేనే పుస్తకాలు ఇస్తామంటూ కార్పొరేట్ స్కూళ్లవిద్యార్థులపైనా, తల్లిదండ్రులపైనా ఒత్తిడి చేస్తున్నాయి.

1994లో వచ్చిన జిఒ నెంబర్ 1 ప్రకారం ప్రయివేటు పాఠశాల ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఇద్దరితో ఒక కమిటీని నియమించాలి. వసూలు చేసిన ఫీజులో ఐదు శాతం యాజమాన్యం, మిగిలిన మొత్తం పాఠశాల అభివృద్ధి, ఉద్యోగుల, సిబ్బంది వేతనాలు, వారికి బీమా, పాఠశాల నిర్వహణకు వ్యయం చేయాలి. 2008లో విడుదల చేసిన 90, 91, 92 జిఒల ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారి, ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ప్రయివేటు విద్యాసంస్థల ప్రతినిధులతో ఒక కమిటీని జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నియమించాలి. అయితే జిల్లాలో ఇవి ఎక్కడా అమలు కావడం లేదు.

కానరాని సౌకర్యాలు

పలు విద్యాసంస్థలు అపార్టుమెంట్లు, రేకుల షెడ్లలో తరగతులను నిర్వహిస్తున్నాయి. గాలి, వెలుతురు వచ్చే విశాలమైన తరగతి గదులు ఎక్కడా కానరావడం లేదు. ఉపాధ్యాయులకు అర్హతలతో పని లేకుండా ఎవరు ఎక్కువ విద్యార్థుల్ని పాఠశాలల్లో చేర్పిస్తే వారికే ఎక్కువ జీతాలు (ఇంక్రిమెంట్లు) ఇస్తున్నారు. ఇక ప్రీ స్కూల్, టెక్నో, ఈ- టెక్నో, సి-బ్యాచ్, ఎస్.బ్యాచ్, ఐపిఎల్, ఒలింపియాడ్ తదితర తోకలను పాఠశాల పేర్లకు ముందో వెనకో తగిలించి రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. గుర్తింపు లేదని, వసతులు సక్రమంగా లేవని ఒకవేళ అధికారులు పాఠశాలలపై చర్యలకు ఉపక్రమిస్తుంటే రాజకీయ నాయకుల ప్రోద్బలంతో తిరిగి పాఠశాలల్ని తెరుస్తున్నారు. దీంతో అధిక ఫీజుల వసూళ్లు, పుస్తకాలకు రూ.5వేలు నుంచి 20వేలు వరకు, 500 విలువ చేసే రెండు జతలు దుస్తులకు రూ.2500 వసూలు చేస్తున్నారు. వీటిని ఆయా పాఠశాలల్లోనే తప్పనిసరిగా కొనాల్సిందే అనే నిబంధనలపై తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలి. కానీ ఇది జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలు చేస్తూ సౌకర్యాలు లేకున్నా, పాఠశాలల యజమానులు నిబంధనలు పాటించకున్నా అన్నీ ఉన్నట్టే అనుమతులు మంజూరు చేస్తున్నారు. దీంతో ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలలు యాజమాన్యాల ఫీజుల దోపిడీకి అడ్డులేకుండా పోతోంది.

పిల్లల చదువు పెద్ద భారంగా మారింది



పిల్లల్ని చదివించడం పెద్ద భారంగా మారింది. ఇద్దరు పిల్లల్ని ప్రైవేటు స్కూల్లో చేర్పించాం. పెద్ద అమ్మాయి 9 వ తరగతి, చిన్న అమ్మాయి 7 వ తరగతి ఇద్దరికీ కలిపి ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, షూ, బెల్టు అన్నీ కలిపి లక్షరూపాయలు ఖర్చయ్యింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఐదు వేలు అదనంగా ఫీజులు పెంచేయడం దారుణం. ఫీజులు కట్టలేము అంటే మానిపించేయమని స్కూల్ యాజమాన్యం చెబుతోంది.

- ఎస్.ఆదిలక్ష్మి,
పావనీనగర్, విజయనగరం



ఎయిర్‌పోర్టు సిఐఎస్‌ఎఫ్ సిబ్బందికి కేటాయించిన భూములు

కోర్టు వివాదంలో భద్రతా సిబ్బంది భూములు

- సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది నివాస గృహాలకు 18 ఎకరాలు కేటాయింపు
- ఆ భూమి గతంలో తమకు ఇచ్చారంటూ కోర్టుకు వెళ్లిన ఫుడ్ కోర్టు సంస్థ
- ఇప్పటికే ఆ భూములను చదును చేసిన జిఎంఆర్ సంస్థ
- మరోచోట ఇచ్చేందుకు ప్రభుత్వ భూమి కోసం వెతుకులాట

ప్రజాశక్తి-భోగాపురం

విమానాశ్రయ భద్రత సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది కోసం తూడెం పంచాయతీ బసవపాలెంలో కేటాయించిన ప్రభుత్వ భూములు కోర్టు వివాదంలోకి వెళ్లడంతో మరోచోట భూమిని కేటాయించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని గ్రామ రెవెన్యూ అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈనేపథ్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు కొన్ని భూములను గుర్తించి అందజేసినట్లు తెలిసింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది 2025 డిసెంబరు నెలాలఖరుకి మొదటి విమానం ఎగరాలని భావిస్తున్నారుర. దానికి తగ్గట్టుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాని అంతకుముందు భద్రతా సిబ్బంది ఉండేందుకు అవసరమైన నివాస గృహాలు నిర్మించాలని అనుకుంటున్నారు. నివాస గృహాల కోసం జిఎంఆర్ సంస్థకు తూడెం పంచాయతీ బసవపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 25లో 21 ఎకరాలు కేటాయించారు. ఇందులో ప్రభుత్వ భూమి 18 ఎకరాలు కాగా మరో 3 ఎకరాలు డి-పట్టా భూమిని ఇటీవల కేటాయించారు. దీంతో ఈ భూముల్లో జిఎంఆర్ సంస్థ హద్దులను నిర్ణయించి ఏకంగా రైతులు ఎన్నో ఏళ్ల నుంచి పెంచిన జీడి తోటలను సైతం తొలగించి నిర్మాణాలు ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. ఈ భూములను గతంలో 2019లో ఫుడ్ కోర్టు సంస్థకు కేటాయించి ఉన్నారు. దీంతో ఆ సంస్థ గతంలో తమకు కేటాయించినందున ప్రభుత్వానికి సొమ్ము చెల్లించేందుకు కొంత సమయం కోరినప్పటికి ఇవ్వకుండా మరొకరికి ఆవే భూములు కేటాయించారని ఏకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఈ భూములు వివాదంలోకి వెళ్లడంతో వెంటనే మరో చోట వారికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో ఉన్న ప్రభుత్వ భూములను గత ప్రభుత్వం జగనన్న కాలనీలకు కేటాయించింది. చాలా చోట్ల ప్రభుత్వ భూములు లేక డి-పట్టా భూములను రైతుల వద్ద కొనుగోలు చేసి లబ్దిదారులకు ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ భూమి దొరకడం కష్టంగానే ఉంది. దీంతో మళ్లీ రైతుల వద్దనున్న డి-పట్టా భూములనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఏవిధంగా జిఎంఆర్ సంస్థకు ఏవిధంగా కేటాయిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఇటీవల సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది కోసం కేటాయించిన ఈ భూములపైనే ఫుడ్ కోర్టు సంస్థ కోర్టును ఆశ్రయించింది.



శ్రీనివాసరావుకు అవార్డు అందజేస్తున్న అదిలీల ఫౌండేషన్ సభ్యులు

ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరానికి చెందిన ఉపాధ్యాయుడు పొట్టా శ్రీనివాసరావు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. 50 మంది పార్లమెంట్ సభ్యులను సత్కరించిన కార్యక్రమంలో అదిలీల ఫౌండేషన్ వారు శ్రీనివాసకు ఈ అవార్డును డిల్లీలో మంగళవారం అందజేశారు.ఉపాధ్యాయ వృత్తిలో ఆయన చేసిన కృషిని అధిలీల ఫౌండేషన్ గుర్తించి అవార్డుతో ఘనంగా సత్కరించారు. శ్రీనివాసరావు నగరంలోని కొనిస వీధిలోగల కొంచెర్ల వారి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గుర్తించి అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందని అన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బొబ్బిలి : కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ కార్యాలయంలో ముందుగా కేక్ కట్ చేసి అనంతరం వైద్యాధికారి శశి భూషణరావు చేతులు మీదుగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.విద్యాసాగర్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం : ఎస్‌పి

సమిష్టి కృషితో ఎన్నికలు ప్రశాంతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం మాసాంతర నేర సమీక్ష సమావేశం జిల్లాపోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది అంతా సమిష్టి కృషితో, సమన్వయంతో పని చేయడం వలన సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయని అన్నారు. ఎన్నికల కమీషను, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారులు, సిబ్బంది గ్రామాలను ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి, గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారన్నారు. ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించి వారికి ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా పని చేయాలని, ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పని చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, గతంలో



డిఎస్‌పి గోవిందరావును అభినందిస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

నమోదైన తీవ్రమైన నేరాల్లో నమోదైన కేసులను ఎస్‌పి సమీక్షించి, ఆయా కేసుల్లో సాధించిన పురోగతిని సంబంధిత దర్యాప్తు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎం.ఎం.సోల్మన్, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, ఎ.ఎస్.చక్రవర్తి, వీరకుమార్, డి.విశ్వనాథ్, యూనివర్స్, న్యాయ సలహాదారులు వై. పరశురాం, పలువురు సిఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

రమ్యకు యూత్ ఫౌండేషన్ అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక దక్కిన వీధి చెందిన కొమ్మూరు రమ్య బిబిఎ డిగ్రీలో 9.7 మార్కులతో ఆంధ్ర యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో విజయనగరం యూత్ ఫౌండేషన్, విజయ దుర్గ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో రమ్యను పట్టణ డిఎస్‌పి గోవిందరావు అభినందించారు. ఈసందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రమ్య విజయంలో వారి తల్లిదండ్రుల పాత్ర కీలకమని అన్నారు. సాధారణ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న వారి తండ్రి కష్టపడి వారి పిల్లలను ఈ స్థాయిలో చదివించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. తన ఉన్నత చదువు కోసం సీతం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు సహకారం అందిస్తున్నట్లు రమ్య తెలిపింది.కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్. ఇల్తమాష్, విజయదుర్గా యూత్ సొసైటీ చైర్మన్ కేశవపట్నం చంద్రిక, విజయనగరం యూత్‌ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రఘు, రాము, రఘురామరాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ అనిత

విపత్తులపై అవగాహన పెంచాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలందరికీ అవగాహన కలిగించాలని డిఆర్‌ఒ అనిత తెలిపారు. బుధవారం జాతీయ విపత్తుల బృందంతో తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల్లో అవగాహనా సదస్సుల కోసం ఎంపిక చేశామని, షెడ్యూల్ ప్రకారంగా అక్కడి ప్రజలంతా ఈ అవగాహనా సదస్సుల్లో పాల్గొనేలా రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ఎన్‌డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డ్యూటీ ఎస్.కె. బెహర అధ్యక్షతన 16మంది సిబ్బందితో కూడిన బృందం విపత్కర పరిస్థితులు సంభవించు గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 18 నుంచి వచ్చేనెల 4వరకు పర్యటిస్తారని తెలిపారు. వరదలు, తుఫాన్లు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు, గుండె పోటు సంభవించేటప్పుడు పిడిగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహనా కలిగిస్తారని తెలిపారు. గంట్యాడ, గజపతినగరం, నెల్లిమర్ల, విజయనగరం, పూసపాటిరేగ, భోగాపురం ,సంతకవిటి, వంగర, బొబ్బిలి మండలాల్లో గల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా విపత్తుల శాఖ పీడీ తారక రామారావు, తహశీల్దార్ రత్నం, సూపరింటెండెంట్ సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థికి సీటు కేటాయింపు ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ టివి గిరి

తొలిరోజు 76 సీట్లు భర్తీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరం సీట్ల భర్తీకి బుధవారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కళాశాల టివి గిరి ఆధ్వర్యాన వృత్తి విద్యా కోర్సుల్లో వివిధ ట్రేడ్‌ల్లో విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లను కేటాయించారు. తొలిరోజు కౌన్సిలింగ్‌కు 89 మంది హాజరు కాగా 76 మంది సీట్లు కేటాయించారు.

ఘనంగా సిరిసహస్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరి సహస్ర జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. జిల్లా పరిషత్ ఛాంబర్ , జెడ్‌పి కార్యాలయ సిబ్బంది కలిసి కేకు కటింగ్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెగా వైద్యశిభిరం నిర్వహించారు. అనంతరం ప్రేమసమాజంలోను, ఆర్‌టిసి కాంప్లెక్సువద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు రామకృష్ణ. హేమంత్. శ్రీనివాసరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సికిల్ సెల్ ఎనీమియాను 2047 సంవత్సరం నాటికి నిర్మూలించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు, బుధవారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా పట్నంలోని గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో ఉన్న 40 సంవత్సరాల లోపు వయసు గల వారికి అవగాహన కల్పించి ముందస్తుగా రక్త పరీక్షలు చేయడం, అవసరమైన వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం మిషన్ లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ఇద్దరు నుంచి లోప భూయిష్ట జన్యువు వచ్చినప్పుడు, సికిల్ సెల్ ఎనీమియాను సాధారణ రక్త పరీక్షలతో నిర్ధారించుకోవచ్చునని అన్నారు, విద్యార్థి దశ నుండి వ్యాధి లక్షణాలు తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియా అవగాహన ఉపసంచాలకులు గిరిజన సంక్షేమ తరపున రామానందం, ఆర్‌బి ఎస్‌కె సమన్వయకర్త, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డిఎంఎంఒ వాణి, డాక్టర్ వెంకటేష్, చంద్రశేఖర్ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాలక్ష్మి వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

సిటియులో అవగాహనా సదస్సు

విజయనగరం టౌన్ : కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో సికిల్ సెల్ ఎనీమియా డేను పురస్కరించుకొని బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముక్య వక్తలుగా విచ్చేసిన అని జిల్లా ప్రభుత్వా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ సమయానుకూల రక్త పరీక్షలు, క్రమం తప్పకుండా మందులను వాడడం, మంచి ఆహారాన్ని తీసుకోవడం, మంచి జీవనశైలిని కలిగి ఉండడం వల్ల ఈ వ్యాధిని అదుపులో పెట్టుకోవచ్చని తెలిపారు. విశాఖపట్నం కేన్సర్ హాస్పిటల్ హెమటాలజిస్ట్ డాక్టర్ రమేష్ ఉప్పాడ మాట్లాడుతూ సికిల్ సెల్ నిర్వహణకు మంచి మందులు అందుబాటులో వున్నాయని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల మాట్లాడుతూ ఈ వ్యాధికి గురైన వారికి ప్రభుత్వం ప్రతినెలా రూ.10వేలు ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. సిటియు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని మాట్లాడుతూ ఈ వ్యాధి నివారణకు పరిశోధనలు జరపడానికి ఐసిఎంఆర్, న్యూ ఢిల్లీ సహకారంతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఒక ప్రాజెక్టును బయోటెక్నాలజీ హెడ్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి ఆధ్వర్యాన అరకు, పాడేరు ప్రాంతాల్లో నిర్వహిస్తోందని తెలిపారు. తలసేమియా, సికెల్ సెల్ వ్యాధి గ్రస్తులకు తమ యూనివర్సిటీలో ఉచిత విద్య, హాస్టల్ వసతి, పుస్తకాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, శరత్‌చంద్ర, జితేంద్ర మోహన్ మిశ్రా పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిటియు విసి ప్రొఫెసర్ కట్టమణి


మెరుగైన సేవలందించాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సచివాలయాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పౌర సేవలు అందే విధంగా చూడాలని కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. బుధవారం నగరంలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ప్రజా ఫిర్యాదుల నమోదు, రిజిస్టర్ల నిర్వహణ, అందిస్తున్న పౌర సేవలపై ఆరా తీశారు. విధులలో నిర్లక్ష్యంగా ఉన్న కార్యదర్శుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. 21, 22 నెంబరు సచివాలయాలను బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను స్వీకరించి నమోదు చేసి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కార్యదర్శులకు ఆదేశించామన్నారు. సచివాలయాల పరిధిలో అనునిత్యం క్షేత్ర పరిశీలనలు చేస్తూ స్థానిక సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రజారోగ్య అధికారులకు తెలపాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణకు ప్రజల సహకరించాలన్నారు. వీధులలో కుక్కల సంచారం పట్ల కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. తప్పనిసరిగా వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ అయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆచంట గార్డెన్ నిర్వహణ పనితీరును ఆయన పరిశీలించారు.



పల్లాను కలిసిన రామారావు


పల్లా శ్రీనివాసరావుతో రామారావు

సంతకవిటి: మండలంలోని తాలాడ మాజీ సర్పంచ్, యాదవ సంఘ నాయకులు ముగ్గు రామారావు బుధవారం విశాఖలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు తాలాడ గ్రామ సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. తాలాడ గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. టిడిపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్

బొబ్బిలి: పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్ దోహదం చేస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక అన్న క్యాంటీన్ భవనాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మూసివేసి పేదల కడుపు కొట్టారన్నారు. 725 రోజులుగా తన సొంత నిధులతో అన్న క్యాంటీన్ నిర్వహించి పేదల ఆకలి తీరుస్తున్నామని చెప్పారు. పేదల ఆకలి తీర్చేందుకు నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ భవనం బయట నిర్మిస్తామని గత ప్రభుత్వం హయాంలో మున్సిపల్ అధికారులు అడిగితే అనుమతి ఇవ్వలేకపోవడం బాధ అనిపించిందన్నారు. టిడిపి ఎన్నికల హామీలో భాగంగా త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో ప్రారంభం తర్వాత మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు శరత్, మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ, సర్పంచులు ఎస్.ఈశ్వరరావు, జి.ఈశ్వర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ

గంట్యాడ: మండలంలోని నరవ, రామవరం గ్రామంలో ఎంపిపి పీరుబండి హైమావతి బుధవారం రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీకి రూ.10 చొప్పున 30 కేజీలకు రూ.300 రాయితీలను ఇస్తున్నారన్నారు. రైతుకి ఒక బస్తా ఇస్తున్నామని రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకీ విత్తనాలు ఇస్తామని చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు తప్పనిసరిగా ఆధారుకార్డుతో ఆర్‌బికె వద్దకు వెళ్లాలన్నారు. మండలానికి 2,290 క్వింటాల విత్తనాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో రామవరం గ్రామ సర్పంచ్ పీరుబండి పద్మావతి, గ్రామ పెద్దలు జైహింద్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, అల్లు విజయకుమార్, పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని జయితిలో బుధవారం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన 1121 రకం వరి విత్తనాలను స్థానిక ఎంపిటిసి మణిపూరి రామచంద్రుడు చేతులమీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఇదే గ్రామంలో ఆల్‌ఫేరలాలు ఆయాయని మైక్ సెల్ను బిజెపి మండల అధ్యక్షుడు మణిపూరి అప్పలనాయుడు వితరణ చేశారు.

ఉపాధి కూలీల హాజరు పరిశీలన

భోగాపురం: మండలంలోని ఏ రావివలస పంచాయతీ నారుపేటలో జరుగుతున్న ఉపాధి కూలీల హాజరును ఎపిఒ ఎమ్. ఆదిబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడకు వెళ్లి కూలీలు ఎంత మంది పనిచేస్తున్నారో ఆరా తీశారు. మేట్లు వద్దనున్న హాజరు పట్టిక ద్వారా పరిశీలించారు. సమయపాలనతో వచ్చి పనులను చేయాలని ఆయన కూలీలకు సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంతో ఆర్థిక పరిపుష్టి

రేగిడి: చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకంతో ఆర్థిక పరిపుష్టి చెందవచ్చునని ఎపిడి మీసాల శ్రీనివాసరావు, ఎంపిడిఒ శ్యామల కుమారి అన్నారు. ఈ మేరకు బుధవారం ఉపాధి కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతి సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో వేతనదారులు అందరికీ పనులు కల్పించాలన్నారు. రోజువారి వేతనం రూ.300 వచ్చేవిధంగా కొలతలు ఇచ్చి పనిచేయించాలన్నారు. మెట్టు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులకు పండ్లతోటలు వేసుకోవడానికి అవకాశం ఉందని, తోటలు ఉన్న రైతులకు కందకాలు, చెట్టుచుట్టూ ట్రెంచ్‌లు తవ్వుకోడానికి చిన్ననీటి కుంటలు తవ్వుటకు అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, ఈసి రామినాయుడు, సాంకేతి సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సెంచూరియన్ యూనివర్సిటీని సందర్శించిన కేంద్ర బృందం

నెల్లిమర్ల: భారత శాస్త్ర సాంకేతిక బృందం బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలోని టిష్యూ కల్చర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ బృందానికి నేతృత్వం వహించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కవి కిషోర్ మాట్లాడుతూ దీనివల్ల రైతులకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్నారు. ఏడాదికి రెండు లక్షల అరటి మొక్కలను ఉత్పత్తి చేయడం కాకుండా 20 లక్షల మొక్కలను ఉత్పత్తి చేస్తే అటు రైతులకు ప్రయోజనంతోపాటు, ఇటు విశ్వవిద్యాలయానికి ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ సందర్భంగా టిష్యూ కల్చర్‌లో అమలు చేస్తోన్న కార్యక్రమాల గురించి డీన్ డాక్టర్ పుష్పలత వివరించారు. ఈ సందర్భంగా డీన్ పుష్పలత మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ నుంచి సర్టిఫికేషన్ లభించడం సెంచూరియన్‌కు ఒక గొప్ప మైలురాయి వంటిదన్నారు. ఈ బృందంలో ప్రొఫెసర్ కవి కిషోర్‌తో పాటు ఐటిఒఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సుజాత, న్యూఢిల్లీకి చెందిన డిబిటి ఎన్‌సిఎస్-టిసిపి శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని స్కూళ్లకు విద్యాశాఖ నోటీసులు

జామి : మండలంలో అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రయివేటు బడులపై విద్యాశాఖ అధికారులు దాడులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలు స్కూళ్ళు మూసివేతకు ఆదేశాలు జారీ చేసిన అధికారులు బుధవారం కుమరాం గ్రామంలోని ఉదయ్ హైస్కూల్‌ను మరో పేరుతో నడుపుతున్నట్లు గుర్తించి యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. స్కూలు పేరు మార్పుకు ధరఖాస్తు చేసుకుని, అనుమతులు వచ్చాక పాఠశాల నడపాలని సూచించారు. అధిక ఫీజులు, మౌలిక సదుపాయాలపైన నిఘా పెట్టి, కఠిన చర్యలకు పాలపడినప్పుడే ప్రయివేటు దోపిడీ అరికట్టాలని ప్రజలు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం పిహెచ్‌సి డాక్టర్లు జె.హారిక, బి శిరీష ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని, ఇంటి ఆవరణంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్య సదుపాయాలు పొందాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొట్టాం పిహెచ్‌సి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకం

నెల్లిమర్ల : మధ్య ప్రదేశ్‌లో జరుగుతున్న ఖోలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ గ్రామానికి చెందిన బి.భార్గవి యూత్ విభాగంలో పాల్గొని రజిత పతకం సాధించింది. కేటగిరి 49లో 68 కిలోల స్నాచ్, 85 కిలోల క్లీన్ అండ్ జర్క్ బరువు ఎత్తి ఈ పతకం సాధించింది. జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బెల్లాన నాగలక్ష్మి, సెక్రటరీ చల్లా రాము ఒక ప్రకటనలెఓ అభినందించారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుపై హర్షం

బొబ్బిలి: ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని నూతన ప్రభుత్వం రద్దు చేయడంపై బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. పట్టణంలో బుధవారం బార్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతులకు నష్టం జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు బార్ అసోసియేషన్ అద్యక్షులు పి.మోహన్ మురళీ కుమార్, కార్యదర్శి విల్సన్‌బాబా, సభ్యులు కృతజ్ఞతలు చెప్పారు.

పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ శంకర్రావు, సహొపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయునికి సన్మానం

కొత్తవలస: స్థానిక ఎస్‌సి కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి రిటైర్డ్ అయిన ములగాడ కనకయ్యను యుటిఎఫ్ నాయకులు బుధవారం సన్మానించారు. కొత్తవలస యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధానకార్యదర్శి జి. విజయగౌరి, గౌరవాధ్యక్షులు ఎన్ఎస్ ప్రసాద్, నాయకులు వి.సురేష్‌కుమార్, జిల్లా నాయకులు జి. వెంకటనాయుడు, పి.రమేష్, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యా యులు సిహెచ్ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికిపోతా'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - భోగాపురం

పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న నేను బడికిపోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ చంద్రకళ పాఠశాల ప్రదానోపాధ్యాయులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రదానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలు లోపు ఉన్న ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలన్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి నెల రోజులుపాటు జరిగే ఈ కార్యమాన్ని సమన్వయంతో నిర్వహించాలన్నారు. దీనికోసం మండల, గ్రామస్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేశామన్నారు. విద్యాశాఖాధికారులు రమణమూర్తి, చంద్రమౌళి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంపై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలన్నారు. అప్పుడే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థుల కోసం అమలవుతున్న పథకాలు, సౌకర్యాలు గురించి వివరించాలన్నారు. ఈ సమావేశంలో సిడిపిఒ ఎస్తేరురాణి, సూపర్ వైజర్లు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఇఒలు కె.వి. రమణ, శ్రీరామ్ 'నేను బడికి పోతా' కార్యక్రమం విధివిధానాలు అమలుపై సమావేశం నిర్వహించారు. విద్యాపరమైన అంశాలు యూ డైస్ ప్లస్, కొత్త అడ్మిషన్స్, విద్యా ప్రవేశ్, బడి బయట పిల్లల గుర్తించి నమోదు చేయడం మొదలైన అంశాలు గూర్చి వివరించారు.


తెర్లాం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు ధనంజయరాజు

తెర్లాం: మండలంలోని వెలగవలస జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ధనంజయరాజు ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఊరు ఊరు తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులను కలిశారు. ఎవరైనా బడి బయట ఉన్న పిల్లలను బడికి పంపించి చదివించాలని తల్లిదండ్రులను కోరారు, చదువు వల్ల ఉపయోగాలు వివరిస్తూ చదువు మూడో నేత్రం మనిషికి వెలుగునిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. వారితోపాటు సచివాలయ సెక్రెటరీ వి.మల్లికార్జున్ రావు, అంగన్వాడీ కార్యకర్త చంద్రకళ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జామి: స్థానిక భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులతో నేను బడికిపోతా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంఇఒ జయశ్రీ మాట్లాడుతూ మండలంలో 21 మంది వికలాంగ పిల్లలను గుర్తించామని, అందులో ఆరుగురిని ఒకటో తరగతిలోనూ, మిగిలిన వారిని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించామని చెప్పారు. ప్రతి ఒక్క పిల్లలను భవిత కేంద్రానికి పంపించి, ఫిజియోథెరపి చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 గంగరాజు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి బి. నర్సింగరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని గిరిజన గ్రామాలలోనూ, గ్రామీణ ప్రాంతాలలోనూ డ్రాప్ అవుట్ లేకుండా చూడాలని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్య యొక్క గొప్పతనాన్ని, విద్య ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా పిల్లల తల్లి తండ్రులను కలసి విద్య యొక్క గొప్పదనాన్ని వివరించినట్లయితే తప్పనిసరిగా ప్రతి పిల్లవాడు రోడ్ మీద తిరగ కుండా తమంతట తామే 'నేను బడికి పోతా' అనే ఆలోచనకు వస్తారాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాంబశివరావు, తహశీల్దార్ కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సికిల్ సెల్ ఎనీమియా పై అవగాహన కలిగి ఉండాలని పూసపాటిరేగ వైద్యులు డాక్టర్ రాజేశ్ వర్మ, ప్రమీల దేవి అన్నారు. బుధవారం మండలంలోని కస్తూరిభా పాఠశాలలో ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 2047 సంవత్సరానికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ ప్రకటించిందని, ఈ వ్యాధి లక్షణాలు, సికెల్ సెల్ ఎనీమియాకు సంబంధించిన పరీక్షలు, సికెల్ సెల్ఎనిమియా చికిత్స మొదలగు అంశాలను వివరించారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ అవగాహనా కార్యక్రమాలు మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు వేదమని, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, సూపర్‌వైజర్లు ఉ మాపతి, నానమ్మ, ఆరోగ్య సహాయకులు ఆర్‌వి రమణ, కెజిబివి ప్రిన్సిపాల్ భారతి, వెలుగు ఎపిఎం నాయుడు, సీసీలు లక్ష్మణ్, శ్రీను, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.


పూసపాటిరేగ: విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రమీలదేవి

మెంటాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం సికేల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెంటాడ పిహెచ్‌సి, వెలుగు ఆధ్వర్యంలో మహిళా సంఘాల మహిళలకు, మెంటాడ హైస్కూల్ పిల్లలకు, అంగన్వాడీ కార్యకర్తలకు సికేల్ సెల్ ఎనీమియా వ్యాధిలక్షణాలు, రక్తహీనత, సికేల్ సెల్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలు గూర్చి మెంటాడ పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ కల్పన అవగాహన కల్పించారు. సికేల్ సెల్ ఎనిమియావ్యాధి లక్షణాలు వున్నవారిని గుర్తించేందుకు మండలంలో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఆంద్ర, లోతుగెడ్డ, జిటిపేట, మీసాలపేట, వెల్ నెస్ సెంటర్‌లలో ఈ వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెంటాడ పిహెచ్ సి సిహెచ్ఓ ఎస్.సత్యనారాయణ, వెలుగు ఎపిఎం సత్యనారాయణ, సిసి అప్పలరాజు మెడికల్ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, ఆశాలు సుజాత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక పిహెచ్‌సిలో ప్రపంచ సికెల్ సెల్ ఎనీమియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎ.ధరణి మాట్లాడుతూ సికెల్ సెల్ ఎనీమియా వంశపారంపర్యంగా వస్తుందని ఎర్ర రక్తకణాలు కొడవలి ఆకారంలో మారి రక్తనాళాలలో ప్రయాణం చేయలేక శరీరంలో నొప్పులు ఎక్కువవుతాయన్నారు. ఈ వ్యాధితో బాధపడే వారికి హెచ్‌బి తగ్గుతుందన్నారు. అవయవాలకు ఆక్సిజన్ అందడం తగ్గుతుందని తెలిపారు. రక్తహీనతలలో సికిల్ సెల్ ఎనీమియా ఇది ఒక రకమైన వ్యాధి అని ఈ వ్యాధి నివారణ పై సిబ్బందికి అవగాహన కల్పిస్తూ గ్రామాలలో ప్రజలు వ్యాధి బారిన పడకుండా తగు సూచనలు చేయాలని సిబ్బందికి సూచించారు.

చెరువు ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం గ్రామంలోని రాజుల వీధికి ఎదురుగా ఉన్న రహదారిలోని క్షీరసాగరం చెరువులోని ఆక్రమణలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. ఇద్దరు వ్యక్తులు ఇటీవలి సుమారు 55 సెంట్లు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశారు. దీనిపై రైతులు రెవెన్యూ అధికారులుకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారి రామునాయుడు జెసిబితో ఆక్రమణలు తొలగించారు. అనంతరం వీరి పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల సర్వేయరు ముదికేశ్వరరావు, సచివాలయ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు కాళీ, రామా రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - రామభద్రపురం

ఉపాధిహామి పథకంలో మస్తర్లలో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎపిఒ త్రినాధరావు హెచ్చరించారు. మండలలలోని ఎస్.చింతలవలస గ్రామంలో బుధవారం ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించి మస్తర్లను తనిఖీ చేశారు.

నకిలీ బంగారం విక్రయాలపై చర్యలు తీసుకోండి

సిపిఎం, సిపిఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి- బొబ్బిలి

నకిలీ బంగారాన్ని అమ్మిన వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి బంగారం వ్యాపారులు నకిలీ బంగారాన్ని అమ్మి ప్రజలను మోసం చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గతంలో శ్రీలక్ష్మి జ్యువెలరీ షాపు యజమాని కోమటిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలను చేసిన మోసం బయట పడగా నేడు గొల్లాది వృద్ధురాలను సుధ జ్యువెలరీ షాపు యజమాని చేసిన మోసం బయట పడిందన్నారు. బంగారం వ్యాపారులు నకిలీ బంగారం, నాసిరకం బంగారాన్ని అమ్మి సొమ్ము చేసుకుని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. నాసిరకం, నకిలీ బంగారం అమ్మకాలపై పోలీసులకు మోస పోయిన వారు ఫిర్యాదు చేశారని, కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బంగారం షాపులపై విజిలెన్స్, ఆదాయపన్ను శాఖ అధికారులు, పోలీసులు దాడులు చేసి నకిలీ బంగారం అమ్మకాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు. ఆయనతో సిపిఎం నాయకులు యుగంధర్ ఉన్నారు.

సుధా బంగారం షాపు యజమానిపై క్రిమినల్ కేసు పెట్టాలి

బొబ్బిలి పట్టణంలో ఉన్న సుధా జ్యూవెలరీ బంగారం షాపు యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బొబ్బిలి పట్టణంలో తరచూ ఇలా గ్రామాల నుంచి వచ్చే అమాయక ప్రజలను బంగారం షాపు యాజమాన్యాలు మోసం చేయడం సరా మామూలుగా మారిపోయిందన్నారు. బొబ్బిలి బంగారం వ్యాపారులు నకిలీ బంగారాన్ని అమ్మి ప్రజలను మోసం చేస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే విజిలెన్స్, ఆదాయపన్ను శాఖ అధికారులు, పోలీసులు స్పందించి నకిలీ బంగారం అమ్మకాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండాలి

డిప్యూటీ డిఇఒ మోహనరావు

ప్రజాశక్తి - రామభద్రపురం

పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యత, శుచి, శుభ్రతతో నిర్వహించాలని డిప్యూటీ డిఇఒ మోహనరావు ఆదేశించారు. మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆహార పదార్థాలను పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు రుచికరంగా మెనూ ప్రకారం వంటలు చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. చిన్న గుడ్లు వచ్చినట్లయితే ఫిర్యాదు చేయాలని, ఆ గుడ్లను తిరష్కరించాలని తెలిపారు. గుడ్డు సుమారు 50 గ్రాముల బరువు ఉండాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అక్కడ గత ప్రభుత్వ హయాంలో ఉన్న గోరుముద్ద బోర్డును తొలగించక పోవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువు తీరిందని పథకాల పేర్లు గమనించి సిఎం పోషణగా మార్చాలని ఆదేశించారు. 'నేను బడికి పోతా' అనే నినాదంతో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిఈడు పిల్లలంతా పాఠశాలలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలకు తక్కువ మంది విద్యార్థులు జాయిన్ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రచారం చేసి విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వమే పుస్తకాలు ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు తిరుమల ప్రసాద్, పెంటయ్య, ఉపాద్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి పట్టణంలో గల ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతమైందని అక్కడ వైద్యులు తెలిపారు. ప్రధానంగా చిన్నారులకు టిబి నమూనాల సేకరణకు సంబంధించి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. పీడియాట్రిక్ టిబి (టిబి) నిర్ధారణ కోసం ఊహించని నమూనాల సేకరణపై దృష్టి సారించే ప్రత్యేక ఆరోగ్య శిబిరానికి అనూహ్య స్పందన లభించిందన్నారు. గ్రామీణ ఆసుపత్రి స్థాయిలో కఫం రహిత నమూనా సేకరణను వికేంద్రీకరించే లక్ష్యంతో కార్యక్రమం ఏర్పాటు చేసామన్నారు. కఫం నమూనాలను అందించలేని పిల్లలలో టిబి నిర్ధారణను మెరుగుపరచడానికి ఒక ప్రయత్నం అని అన్నారు. టిబిని ఎదుర్కోవడానికి, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడానికి జిల్లాలో కొనసాగుతున్న ప్రయత్నాలలో ఈ కార్యక్రమం ఒక భాగం అని వైద్యులు అన్నారు. శిబిరంలో కీలకమైన నమూనాల సేకరణను సులభతరం చేయడమే కాకుండా పిల్లల టిబి, దాని లక్షణాలు, ముందస్తు రోగ నిర్ధారణ, చికిత్స యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహనను కూడా పెంచిందని వైద్యులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఏరియా ఆసుపత్రి వైద్యులు ఎంపివి నాయక్, ఝాన్సీ, సింహాచలం, జి లళిత, ఎం చిట్టిబాబు, హెచ్ఐవి యూనిట్ సిబ్బంది లంక శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన

గంట్యాడ: జాతీయ విపత్తుల ప్రతిస్పందనపై మండలంలోని కొండతామరాపల్లి బాలాజీ కళ్యాణ మండపంలో బుధవారం జాతీయ విపత్తుల ప్రతిస్పందన పోర్సు సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఏ విధంగా చర్యలు తీసుకోవాలన్న విషయాన్ని ఎస్‌కోట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ షేక్ మదీనా వివరించారు. విపత్తుల సమయంలో ప్రమాదలు సంభవించినప్పుడు ఏ విధంగా రక్షించుకోవాలని విషయాన్ని ప్రదర్శన ద్వారా తెలియజేశారు. విపత్తుల నిర్వహణ ఇన్‌స్పెక్టర్ సుశాంత్ కుమార్ బెహరా తుఫాన్లు వరదలు భూకంపాలు అగ్ని ప్రమాదాలు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మానవ తప్పిద విపత్తుల సమయంలో ఎలా స్పందించాలో మాక్ డ్రిల్ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రాజేశ్వరి, తహశీల్దార్ నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సివిల్ జడ్జి విజయ కల్యాణి

పినతాడివాడలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడలో నల్సా వారి సౌజన్యంతో న్యాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విజయనగరం సివిల్ జడ్జి కె విజయ కళ్యాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె అసంఘటిత కార్మికులు, రైతులకు సామాజిక భద్రత చట్టం 2008 పైనా అవగాహన కల్పించారు. మరో ముఖ్య అతిథి ప్రజా ప్రయోజత సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి దుర్గయ్య మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు ప్లాపస్ చేస్తున్న సేవలు వ్యవసాయ కూలీలు, కుల వృత్తులు చేసే వారు ఏ విధంగా శ్రమ దోపిడీకి గురవుతున్నారో వారికి సమాజంలో గౌరవంగా ఆర్థిక భరోసా ఆర్థిక భద్రతతో కూడిన జీవించే హక్కులపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.టి రామారావు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు రైతు కూలీలకు చేపడుతున్న అంశాలను వివరించారు. సేంద్రీయ జిల్లా వ్యవసాయ అధికారి ఆనందరావు మాట్లాడుతూ నవధాన్యాలు సాగు సమ్మేలత మిశ్రమ పంటలపై అవగాహన, పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగం, సేంద్రీయ ఎరువులు, కషాయములు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామారావు, ఎంపిడిఒ లవరాజు, ఎఒ నిర్మల, ఇఒపిఆర్‌డి శంకర్, జగన్నాథం, సర్పంచ్ లంక లక్ష్మణరావు, మాజీ సర్పంచు వాళ్ల వెంకటరావు, మాజీ ఎంపిటిసి కోరనాన ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి- రేగిడి

జిల్లాలో రక్త నిల్వలు నిండుకున్నాయని, యువత రక్తదానానికి ముందుకు రావాలని శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ దూబ పద్మ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, మామిడి ఆనందరావు, యూపీ రాజు, గర్భాన సత్తిబాబు అన్నారు. బుధవారం శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఉంగరాడమెట్ట జూట్ మిల్లు ఆవరణలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. ఇప్పటికే జిల్లాలలో రక్త నిల్వలు లేక ఎంతో మంది అభాగ్యులు ప్రాణాలు వదిలారన్నారు. యువత ఎక్కువ మంది రక్తదానం చేయాలని కోరారు. జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పదవి బాధ్యతలు చేపట్టినందుకు రక్తదానం చేస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పేదవాడే ప్రామాణికంగా తీసుకొని సంక్షేమ, అభివృద్ధి పథకాల అందించాలన్నారు. ఈ రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొని రక్తదానం చేశారు. రక్త దాతలకు షీల్డ్, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, రెడ్డి బాలకృష్ణ, గొర్లె గోవిందరావు, ఆటో జానీ, విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ దర్శా ఉన్నారు.

ప్రకృతి సాగు పరిశీలన

వేపాడ: ప్రకతి వ్యవసాయం సాగులో రీజనల్ అధికార అయినా ఆర్టీవో హేమ సుందర పరిశీలన. మండలంలోని భరతవానిపాలెంలోని చిరుధాన్యాల సాగు బ్లాక్‌ను ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి హేమసుందర్ బుధవారం పరిశీలించారు. రాయుడుపేటలో వరి పంటకు ముందు పచ్చిరొట్ట విత్తనాలను చల్లించారు. ఆతవ, ఆకుల సీతంపేట గ్రామాలలో నువ్వు పంటలో అంతర పంట సాగు పద్ధతిని పరిశీలించారు. పెద్ద కృష్ణరాజపురంలో రైతులకు వరి పంట వేసే ముందు నవధాన్యాల పచ్చిరొట్ట ఎరువులు పెంచడానికి విత్తనాలను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయ భాగంలో పని చేస్తున్న ఫార్మర్ సైంటిస్టులు, మెంటర్స్ ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. వివిధ గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఎ కోఆర్డినేటర్ పెద్ద వెంకట రావు, ఎంఎల్‌టి వసంత, ఎంటిఎస్ సన్యాసమ్మ, త్రిమూర్తులు, ఈశ్వర్‌రావు, రాము, ఈశ్వరమ్మ, నారాయ ణమ్మ, రామలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.


అంతర పంటలపై అవగాహన కల్పిస్తున్న హేమసుందర్

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

శృంగవరపు కోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. కేశవరావు, స్కిల్ ఆఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ జి ఈరన్న తెలిపారు. ఈ కోర్సుకి 18 నుంచి 28 సంవత్సరాల ఇంటర్మీడియట్, డిగ్రీ పాసైన యువతీ యువకులు అర్హులని ఈ కోర్సు మూడు నెలల పాటు ఉంటుందని కోర్సు పూర్తయిన తర్వాత ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. కోర్సులో జాయిన్ అవ్వడానికి ఆఖరి తేదీ జూన్ 24 అని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9000234642, 7995691295 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పబ్లిక్ నోటీస్
విజయనగరం III అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No. 350/2020

Between:
A.P.G.V. Bank, Bonangi ....వాది
And
1. రామతోట అనసూయ, W/o లేటు రాంబాబు, బోనంగి గ్రామం, గంట్యాడ మండలం, విజయనగరం జిల్లా.
2. రామతోట లక్ష్మణస్వామి, S/o లేటు చిన్నమ్మడు, Rest - Dito -
3. రామతోట వెంకటలక్ష్మీ, W/o లేటు సన్యాసినాయుడు, R&B Junction, కంటోన్మెంట్, విజయనగరం.
.........ప్రతివాది

పై కేసులో వాది బ్యాంక్ బకాయి సొమ్ము వసూలు చేయుటకు పై దావా దాఖలు చేసియున్నారు. పైన ఉదహరించిన కేసు **తే 01-07-2024దీ**న మీకు నోటీసు చేయుచూ వాయిదా అయిఉన్నది. పై తేది నాడు పై కోర్టులో **ఉదయం గం॥ 10-30ని॥**లకు స్వయంగా కాని లేక లాయర్ గారి ద్వారా కాని హాజరు కావలసిందిగా పై కోర్టువారు ఆదేశించి ఉన్నారు. అట్లు హాజరు కాని పక్షంలో మీ పరోక్షమందు శ్రీ కోర్టువారు తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

ధవళ వెంకటరావు
న్యాయవాది,
విజయనగరం

నోటీస్
మహారాజశ్రీ బొబ్బిలి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
IA 1100/2022 O.S. 246/2022

పోలా బలరాం ......వాది.
తాడ్డి శ్రీనివాస రావు @ చిన్నా రావు. ...ప్రతివాది.
టు
తాడ్డి శ్రీనివాస రావు @ చిన్నా రావు S/o కృష్ణ, పారాది గ్రామం, బొబ్బిలి మండలం విజయనగరం జిల్లా

ఇందలి వాది పై నెంబర్ దావా లో మీపై బకాయి రాబట్టు నిమిత్తమూ దాఖలు చేసిన దావా మరియు ప్రథమ జప్తు పిటిషన్ IA 1100/2022 **తే 25-06-2024 దీ**ని వాయిదా అయి ఉన్నది ఆ దినము మీరు శ్రీ కోర్టు వారి యెదుట **ఉదయం 10.30 ని॥**లకు స్వయము గా గాని, మీ అధీకృత ఏజెంట్ ద్వారా గాని హాజరై మీ వాదన దాఖలు చేసుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున పై దావా పరిష్కరించబడును.

(శ్రీ కోర్టువారి ఆదేశములతో)
తిరుపతి పాణిగ్రాహి
వాదితరపు న్యాయవాది,
బొబ్బిలి